## క్లుప్తంగా

### పక్కాగా పరీక్షలు నిర్వహించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

**హిరమండలం:** పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పక్కాగా నిర్వహించాలని ఎంఈవో రాంబాబు ఆదేశించారు. సోమవారం నుంచి ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పరీక్షల తీరును పరిశీలించారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు. సజావుగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పర్యవేక్షక అధికారులు బొడ్డేపల్లి చక్రపాణి, జి.రమేష్‌లకు ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో 54 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు.

### పరీక్ష కేంద్రం పరిశీలన

**నరసన్నపేట:** స్థానిక సెంట్ క్లారెట్ స్కూల్లో సోమవారం నుంచి పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు తెలుగు పరీక్ష నిర్వహించగా ఈ పరీక్షలను డిప్యూటీ డీఈవో విజయకుమారి పరిశీలించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లో ఉన్న ఆమె పరీక్ష నిర్వహిస్తున్న గదులను పరిశీలించి ఇన్విజిలేటర్లకు తగు సూచనలు చేశారు. ఆమెతో పాటు ఎంఈవో శాంతారావు ఉన్నారు. కాగా తెలుగు పరీక్షకు రెండు కేంద్రాల్లో 17 మంది గైర్హాజరయ్యారని ఎంఈవో తెలిపారు.

### కలప అక్రమ రవాణా



రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్న కలప

**పాతపట్నం:** మండలంలోని తెంబూరు మీదుగా బొంతు, సారవకోట, జలుమూరు మండలాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి యథేచ్ఛగా కలప అక్రమంగా రవాణా జరుగుతోంది. చెట్లను నరికి సాయంత్రం, రాత్రి వేళల్లో తరలించుకుపోతున్నారు. తెంబూరు కూడలిలో అటవీ శాఖ బీట్ ఆఫీసర్ కార్యాలయం ఉన్నప్పటికీ, బీట్ ఆఫీసర్ కార్యాలయం మీదుగా కలప అక్రమ రవాణా చేయడం గమనార్హం. దీనిపై అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### నిధులు మంజూరు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తులసీవరప్రసాదరావు తదితరులు

**కొత్తూరు:** మండలంలోని ఎస్ఎస్ కాలనీ సమీపంలో హడ్డబంగి గెడ్డకు ఉన్న చెక్‌డామ్ తిత్లీ తుఫాన్‌కు కొట్టుకుపోయింది. దీంతో చెక్‌డామ్ పునః నిర్మాణం చేసేందుకు నిధులు కేటాయించాలని కొత్తూరు వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు తదితరులు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. కొత్తూరు, సిరువాడ, కర్లెమ్మ గ్రామాలతో పాటు పలు గ్రామాలకు సాగునీరు అందించే చెక్‌డామ్ పాడైనందున సుమారు రెండువేల ఎకరాలకు సక్రమంగా సాగునీరు అందడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

### మూగజీవాల సంరక్షణపై అవగాహన

**ఎల్.ఎన్.పేట:** మూగ జీవాలైన గొర్రెలు, మేకలు, పాడి పశువుల సంరక్షణపై అవగాహన కల్పించాలని కొత్తూరు డివిజన్ పశుసంవర్ధక శాఖ ఏడీ జి.నారాయణరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, పశుసంవర్ధక శాఖ గ్రామ సచివాలయ సహాయకులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ఒకవైపు వేసవి ఎండలతో పాటు మరోవైపు వర్షాలు కురుస్తున్నాయని, అందువలన పశువులు, జీవాలు మేతకు తీసుకుని వెళ్లే కాపర్లకు తగిన సూచనలు చేయాలన్నారు. ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వర్షం పడినప్పుడు చెట్లు కింద, పాడుబడిన భవనాలు, విద్యుత్ స్తంభాల వద్ద ఉండకూడదని స్పష్టం చేశారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు, వేడి వడగాలులు వేసినప్పుడు నీడకు చేరుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పైడి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, పశువైద్యాధికారి జి.కవిత తదితరులు పాల్గొన్నారు.

### సజావుగా ఏపీఈఏపీ సెట్ పరీక్ష



హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

**నరసన్నపేట:** స్థానిక కోర్ టెక్నాలజీలో సోమవారం ఏపీఈఏపీ సెట్ పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 7.30 నుంచే లోపలికి అనుమతించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అన్ని తనిఖీలు నిర్వహించి లోపలికి అనుమతించారు. కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.

# అన్నదాతకు కష్టకాలం..!



కొరసవాడలో దుక్కుతున్న రైతులు

- రాయితీపై అందని వ్యవసాయ పరికరాలు, యంత్రాలు
- ప్రైవేటు వ్యక్తుల వద్ద అద్దెకు తెచ్చుకుంటున్న వైనం
- అందని అన్నదాత సుఖీభవ
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

**పాతపట్నం:** అన్నదాతను కష్టకాలం వెంటాడుతోంది. శ్రమనే నమ్ముకున్న రైతన్నకు కూటమి ప్రభుత్వంలో చేయూత కరువైంది. కల్లబొల్లి మాటలు చెప్పడమే తప్ప కూటమి పాలనలో హామీలు అమలు కావడం లేదు. రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పథకం పేరిట ఏటా రూ.13,500లు పంటల సాగుకు పెట్టుబడి సాయం ఠంచన్‌గా అందించేంది. అయితే తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఇస్తామని కూటమి పెద్దలు హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ఖరీఫ్ సీజన్ గడిచిపోగా, రబీ సీజన్ కూడా ముగిసిపోతోంది. మళ్లీ ఖరీఫ్ సీజన్ వచ్చేస్తున్నా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా రైతులకు అందించలేదు. రాయితీ విత్తనాల దగ్గర నుంచి వ్యవసాయ పరికరాల వరకు 20 రకాల సేవలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుల ఇళ్ల వద్దకు అందించేది. ఇప్పుడు ఆ సేవల ఊసేలేదు. రైతు కష్టాన్ని గుర్తించే నాథుడూ లేడు.

**ఒక్క పరికరం ఇస్తే ఒట్టు**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ రైతు భరోసా కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ల(సీహెచ్‌సీ)ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ పరిధిలో రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి ఒక్కో సంఘానికి డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా 40 శాతం రాయితీ, 60 శాతం బ్యాంకు రుణంతో రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్లు, దుక్కు సెట్లు, నూర్పిడి యాంత్రాలు, రోటో వీటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు తదితర పరికరాలు అందించారు. ఈ యంత్ర పరికరాలను సంఘంలోని రైతులు వినియోగించుకోవడంతో పాటు గ్రామాల్లోని మిగతా రైతులకు నామమాత్రపు అద్దెకు ఇచ్చేవారు. అలాగే 50 నుంచి 90 శాతం రాయితీపై డ్రిప్, స్పింకర్లు, పైపులు, రాయితీపై సోలార్ పంపు సెట్లు కూడా అందేవి. ప్రస్తుతం ఇవి అటకెక్కాయి. ఖరీఫ్ ముగిసే సమయానికి అందాల్సిన కొత్త నూర్పిడి యంత్రాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించలేదు. కొత్తగా మండలాలకు రాయితీపై ట్రాక్టర్లు రాలేదు.

**పచ్చిరొట్ట విత్తనాల మాటే లేదు**

గత ప్రభుత్వ హయాంలో వేసవిలో అన్ని గ్రామాల్లో రైతులకు 50 శాతం రాయితీపై నవధాన్యాల విత్తనాలు ఇచ్చేవారు. అలాగే పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు కూడా అందించేవారు. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అక్కడక్కడా రైతులకు నవధాన్యాల విత్తనాలు అందిస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో ప్రభుత్వం వీటిని పంపిణీ చేయడం లేదన్న విమర్శలు సైతం రైతుల నుంచి వస్తున్నాయి. మరోవైపు పంటపొలాల్లో మట్టి నమూనాల సేకరణ, వాటి పరీక్షలు అటకెక్కాయి. గతంలో ప్రతీ పంచాయతీలో మట్టి నమూనాలను సేకరించి నియోజకవర్గ కేంద్రంలోని అగ్రిల్యాబ్‌లో పరీక్షలు చేసి వాటి ఫలితాల పత్రాలను రైతులకు అందించి, ఏ పంటలు సాగు చేయాలో అవగాహన కల్పించేవారు. ఈ ఏడాది ఈ విధానం లేకపోవడంతో రైతులు బేల చూపులు చూస్తున్నారు.

### పెట్టుబడి పెరుగుతోంది



గతంలో వైఎస్సార్ యంత్ర సేవా పథకంతో పాటు రైతు మిత్ర సంఘాలకు, పీఏసీఎస్ కేంద్రాలకు ట్రాక్టర్లు ఉండేవి. వీటిని అద్దెకు తెచ్చి దుక్కులు చేసేవాళ్లం. నామమాత్రపు అద్దెలు ఉండేవి. ప్రస్తుతం ఇవి ఎక్కడా కనిపించడం లేదు. దుక్కుల కోసం ప్రైవేటు వ్యక్తుల ట్రాక్టర్లను పెట్టాల్సి వస్తోంది. ఎకరానికి దుక్కుకు రూ.15,00 వరకు తీసుకుంటున్నారు. అన్నింటికీ పెట్టుబడి పెరిగిపోతోంది.

– గొకవలన రాము, కాపువీధి, పాతపట్నం

### గతంలో యంత్ర పరికరాలు ఇచ్చారు



గత ప్రభుత్వం రైతులకు యంత్ర పరికరాలు అందించింది. మా బంధువులకు రాయితీపై వరి నూర్పిడి యంత్రం ఇచ్చారు. ఈ యంత్రం ద్వారా తక్కువ పెట్టుబడితో పంట నూర్పిడి చేసుకున్నాం. ఈ ఏడాది ఎవరికీ రాయితీపై యంత్రాలు రాలేదు. జొన్న పిక్కల నూర్పిడికి ప్రైవేటు వ్యక్తి వద్ద యంత్రం తీసుకువస్తే ఎకరానికి రూ.4 వేలకు పైగా తీసుకున్నారు.

– బొంగు శ్రీరాములు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం

### అప్రమత్తంగా ఉండాలి



పాతపట్నం: మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రకుమారి



జలుమూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

**జలుమూరు:** జిల్లావ్యాప్తంగా రానున్న ఐదు రోజుల్లో కురవనున్న వర్షాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జెన్ని రామారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ, పంచాయతీరాజ్, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశం సోమవారం నిర్వహించారు. పిడుగులతో కూడిన వర్షాలు పడనున్న నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో ప్రజలు ఉండకూడదని, ప్రధానంగా గొర్రెల కాపారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ ఉపకరణాలు స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఏవో కె.సురేష్ కుమార్, పశువైద్యులు పట్ట సంతోష్ కుమార్, ఎం.దీప్తి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

**పాతపట్నం:** ఉరుములు వచ్చేటప్పుడు పిడుగులు పడే అవకాశాలు ఉంటాయని అందువలన అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.చంద్రకుమారి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో అక్కడక్కడ వర్షాలు పడే సమయంలో పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు. ఆ సమయాల్లో ఆరుబయట గానీ, చెట్లు కింద ఉండరాదని, అలాగే సెల్‌ఫోన్లు వినియోగించకుండా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.కరుణాకరరావు, ఎస్ఐ బి.లావణ్య, డాక్టర్లు అనిల్ కుమార్, శ్రీవాణి, మౌనిక పాల్గొన్నారు.

### స్థానికంగా అందుబాటులో ఉండాలి

**హిరమండలం:** విపత్తుల సమయంలో అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండి సేవలందించాలని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్, తహసీల్దార్ ఎస్.హనుమంతురావులు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. రానున్న కాలంలో విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడాలన్నారు. ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### ఏకగ్రీవంగా ఎన్నిక



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న కల్యాణి

**సారవకోట:** స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకగ్రీవమైంది. మాళువ ఎంపీటీసీ జమినివలస కల్యాణిని వైస్ ఎంపీపీగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమెను చిన్నకిట్టాలపాడు ఎంపీటీసీ సభ్యురాలు కిట్టాలపాడు విజయకుమారి ప్రతిపాదించగా గుమ్మపాడు ఎంపీటీసీ సభ్యుడు పంగ అప్పారావు బలపర్చారు. ఈ ఎన్నికకు 13 మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కావల్సి ఉండగా, కుమ్మరిగుంట ఎంపీటీసీ సభ్యురాలు హాజరు కాకపోవడంతో 12 మంది సభ్యులు హాజరైయ్యారు. వీరిలో 11 మంది సభ్యులు ఆమెను చేతులెత్తి ఏకగ్రీవంగా ఎన్నుకోగా, సారవకోట ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు చేయి ఎత్తలేదు. దీంతో ఆమె ఎన్నికను ఎన్నికల అధికారి ఎం.లోకనాథం ధ్రువీకరించారు. అనంతరం ఆమెకు నియామకపత్రం అందించగా నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడుతో పాటు ఇతర సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌కుమార్, మండల పరిషత్ ఏవో చిన్నమ్ముడు పాల్గొన్నారు.

# ప్రమాదపుటంచున ప్రయాణం



సవలాపురం జంక్షన్ వద్ద శిథిలమైన కల్వర్టు

- కల్వర్టులపై భయం భయం
- అంతరాష్ట్ర రహదారుల్లో ఇబ్బందులు

**సరుబుజ్జిలి:** రహదారుల కల్వర్టులపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించడం లేదు. ఆమదాలవలస నియోజకవర్గంలో దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టుల నిర్వహణ విషయంలో ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు గుసగుసలాడుతున్నారు. అలికాం నుంచి బత్తిలి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారికి అంతర్ రాష్ట్ర రహదారి అనుసంధానం చేయబడింది. ఇక్కడి నుంచి ఒడిశాకు వందలాది భారీ వాహనాలు తరుచూ ప్రయాణాలు చేస్తుంటాయి. ఈ ప్రమాదకరమైన పరిస్థితిలో ప్రయాణాలు చేస్తూ పలుమార్లు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**శిథిలమైన కల్వర్టర్లు ఇవే...**

సరుబుజ్జిలి మండలంలోని అలికాం బత్తిలి రహదారిలో ఏఎల్‌నగరం, బప్పడాం, షళంత్రి, సవలాపురం జంక్షన్, నక్కటపేట వద్ద కల్వర్టులు పూర్తిగా శిథిలమయ్యాయి. పొందూరు మండలంలోని తండ్యాం, బానాం, లక్ష్మీపేట, కింతలి, గూనాలపేట, నందివాడ, రాపాక, లోలుగు, బూర్జ మండలంలోని గుత్తావల్లి, నీలాదేవిపురం, అల్లెన, బూర్జ, మదనాపురం, బొమ్మిక ప్రాంతాల్లో కల్వర్టులు దశాబ్దాల క్రితం నిర్మించడం వలన పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉన్నాయి.

| మండలం | మొత్తం కల్వర్టులు | శిథిలావస్థలో ఉన్నవి |
|---|---|---|
| ఆమదాలవలస | 17 | 10 |
| సరుబుజ్జిలి | 12 | 10 |
| బూర్జ | 13 | 11 |
| పొందూరు | 15 | 13 |

**వరదలు అంటే భయం**

వరదల సమయంలో ఆమదాలవలస మండలం చెవ్వాకులపేట, దూసి, తమ్మయ్యపేట, తోటాడ, కణుగులవలస, జొన్నవలస, మునగవలస, నెల్లిపర్తి, తురకపేట గ్రామాల పరిధిలో కల్వర్టుల వద్ద భారీగా వరద నీరు ప్రమాద స్థితిలో ప్రవహిస్తుంది. ఇలాంటి సమయాల్లో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తుంటారు.



లొద్దల కాగితాపల్లి వద్ద పాడుబడిన కల్వర్ట్



చెవ్వాకులపేట వద్ద ప్రమాదకర స్థితిలో ఉన్న కల్వర్టు

### పనితీరు అధ్వానం



రహదారులు, కల్వర్టుల మరమ్మతుల విషయంలో ఆర్అండ్‌బీ వ్యవస్థ పట్టనట్లు వ్యవహరిస్తోంది. అసలు అధికారులు ఉన్నారో లేదో తెలియని పరిస్థితులు ఉన్నాయి. సమస్యను ఎన్నిసార్లు వారి దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోవడం లేదు. సమావేశాలకు కూడా సక్రమంగా హాజరుకావడం లేదు. వీరి పనితీరు పరమ అధ్వానంగా ఉంది.

– సురవరపు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ, సరుబుజ్జిలి

### ప్రతిపాదనలు పంపించాము

పాడైన రహదారులు, కల్వర్టుల విషయంలో ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాము.

– ఎం.ఆంజనేయనాయక్, ఆర్అండ్‌బీ, జేఈ

## నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న చింతాడ రవికుమార్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు దుర్వినియోగం అవుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ తదితర మండలాల్లోని కూటమి పాలకుల అవినీతిపై సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఫిర్యాదు చేశారు. సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట పంచాయతీలో పంచాయతీ నిధుల వినియోగంలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఆమదాలవలస మండలంలోని రామచంద్రపురం పంచాయతీలో ఉపాధి హామీ పనుల్లో టీడీపీ నాయకులు పాల్పడుతున్న అక్రమాలపై దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బూర్జ మండలంలోని ఓవీపేట గ్రామంలో రాజకీయ వివక్షతో విధుల నుంచి అక్రమంగా తొలగింపబడిన మధ్యాహ్న భోజన పథకం వర్కర్లను తిరిగి విధుల్లోకి కొనసాగించమంటూ హైకోర్టు ఆదేశాలను అమలుపరచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సరుబుజ్జిలి మండలంలోని యరగాం పంచాయతీలో జరుగుతున్న భూ తాగాదాను పరిష్కరించాలన్నారు. ఆయనతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## కూటమి పాలనలో మహిళలపై దాడులు

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



**ఎల్.ఎన్.పేట:** కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికల్లో జరిగిన ఘటన బాధాకరమని పేర్కొన్నారు. తిరువూరు మున్సిపాలిటీ 1వ వార్డు కౌన్సిలర్ నిర్మలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఆ కౌన్సిలర్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నప్పటికీ పట్టించుకోకుండా బలవంతంగా లాక్కెళ్లిపోయారని, ఇదేమి రాజ్యాంగమో అర్థం కావడం లేదని మండిపడ్డారు. ఆమె మెడలో ఉన్న జెండాను టీడీపీ నాయకులు తీసేసి చెట్లపైకి విసిరేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పోలీసులు టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేయాల్సిన పోలీసులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

### నిబంధనలు పాటించాలి



క్వారీని పరిశీలిస్తున్న అధికారులు

**హిరమండలం:** క్వారీ పరిశ్రమల నిర్వహణలో నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ఎస్.హనుమంతురావు సూచించారు. మెళియాపుట్టి మండలంలో క్వారీ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో భూగర్భ, మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మండలంలోని క్వారీలను సోమవారం పరిశీలించారు. లోకొండ, సుబలాయి రోడ్డు, కొండరాగోలు, కిట్టాలపాడు, అంతకాపల్లి, మజ్జిగూడ గ్రామాల్లో నిర్వహిస్తున్న క్వారీలను పరిశీలించారు. యాజమాన్యాలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. క్వారీ పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా కార్మికుల భద్రత విషయంలో నిబంధనలు పాటించాలన్నారు. ఆయనతో పాటు ఎస్ఐ ఎండీ యాసిన్, ఆర్ఐ నీలిమ, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

**కొత్తూరు:** స్టోన్ క్రషర్ నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ, సీఐ ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ అన్నారు. మండలంలోని దిమిలి, శోభనాపురం గ్రామాల వద్ద నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్‌కు సంబంధించిన క్వారీల్లో సోమవారం తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా పేలుళ్లు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### క్వారీ అనుమతులు పరిశీలన



క్వారీ అనుమతులు పరిశీలిస్తున్న అధికారులు

**మెళియాపుట్టి:** ఇటీవల మండలంలోని దబ్బగూడ కొండ క్వారీపై జరిగిన పేలుడు వలన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి ఆదేశాల మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ పాపారావు, ఎస్ఐ రమేష్ బాబు, మైనింగ్ అధికారులు, ఇతర అధికారులు కలిసి పద్ద రెవెన్యూ పరిధిలోని ఒక క్వారీ అనుమతులను పరిశీలించారు. అనుమతులు లేకుండా గ్రానైట్ క్వారీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అనుమతులు తప్పనిసరి



కిడిమి సమీపంలో క్వారీ పరిశీలిస్తున్న అధికారులు

**సారవకోట:** గ్రానైట్ క్వారీలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. మండలంలోని కిడిమి, మదనాపురం, చోడసముద్రంలలో క్వారీలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 47 క్వారీలున్నాయని, దాంట్లో ప్రస్తుతం 13 క్వారీలు మాత్రమే నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్వారీలు అక్రమంగా నిర్వహించినా, బాంబు పేలుళ్లు చేపట్టినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. క్వారీలు పరిశీలించి పూర్తిస్థాయి నివేదిక కలెక్టర్‌కు పంపిస్తామన్నారు. ఆమెతో పాటు ఎస్ఐ అనిల్ కుమార్, మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో రాము తదితరులున్నారు.

## సంక్షిప్తంగా..

**పూడికతీత పనులు చేపట్టాలి**

**నరసన్నపేట:** వంశధార నిర్వహణ డివిజన్ పరిధిలో సాగునీటి కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వంశధార నిర్వహణ డివిజన్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు.

**ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం**

**కొత్తూరు:** ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన బెండ, చిక్కుడు పలు రకాల కూరగాయలను స్థానిక ఎంపీడీవో కార్యాలయం అవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయం కొత్తూరు డివిజన్ ఎంటీఎస సూర్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మకాలు చేశారు.

**రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు**

**ఎల్.ఎన్.పేట:** మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు విక్రయిస్తున్నట్లు ఏవో పైడి లతశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకుని వెళ్లి వారి వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. 10 కిలోల ప్యాకెట్లు రూపంలో విత్తనాలు లభిస్తున్నాయని, ఎకరానికి 30 కిలోల విత్తనాలు అవసరం ఉంటాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే 50 శాతం రాయితీ పోను, జీలుగు విత్తనాలు కిలో రూ.61.50లు, కట్టి జనుమ విత్తనాలు కిలో రూ.54.50లు, పిల్ల పెసర విత్తనాలు రూ.90లు చెప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు.

**ప్రకృతి వ్యవసాయంతో మేలు**

**హిరమండలం:** ప్రకృతి వ్యవసాయంతో రైతుకు మేలు జరుగుతుందని డీపీఎం పూజారి సత్యనారాయణ, ఎస్పీఎంయూ ప్రవీణ్ అన్నారు. మండలంలోని గులుమూరులో రైతులతో సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని చెప్పారు.